క్లుప్తంగా

ఏయూ విభాగాల్లో రెక్టార్ తనిఖీలు



విద్యా బోధనను పరిశీలిస్తున్న ఏయూ రెక్టార్ కిషోర్‌బాబు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీలోని పలు విభాగాలను గురువారం రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్య, తత్వశాస్త్రం, ఇంగ్లిష్, లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ సైన్స్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ అండ్ ఆర్కియాలజీ, ఆంత్రోపాలజీతో సహా పలు విభాగాలను సందర్శించారు. విద్యార్థులందరూ తరగతులకు హాజరవుతున్నారని, కళాశాల వేళల్లో డిపార్ట్‌మెంట్‌లలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పూర్తి స్థాయిలో ఉండటంతో సంతోషం వ్యక్తం చేశారు. ఆయా విభాగాల్లో విద్యార్థులకు అందిస్తున్న బోధనను రెక్టార్ ప్రత్యక్షంగా పరిశీలించారు.

సోషల్ వర్క్ విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన



ప్రభుత్వ మానసిక వైద్యశాలలో ఏయూ సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు గురువారం క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారు. సోషల్ వర్క్ ఫస్టియర్ విద్యార్థులు ప్రభుత్వ మానసిక చికిత్సాలయం, ఆర్‌సీడీ ఆస్పత్రులను సందర్శించారు. ఈ సందర్భంగా మానసిక సమస్యలు, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడం, రోగులకు అందించే చికిత్సలు, సామాజిక సేవ తదితర అంశాలపై విద్యార్థులకు అధ్యాపకులు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.హరినాథ్, అధ్యాపకులు డాక్టర్ ఎం.అబ్రహం, డాక్టర్ జి.పుష్పలత, డాక్టర్ వేసవిల, డాక్టర్ సూరిబాబు, డాక్టర్ హనుమంత లక్ష్మణరావు, డాక్టర్ ఎం.శిరీష తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు



తోటగరువు హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ కృష్ణ

ఆరిలోవ: పోలీస్ అమర వీరుల దినోత్సవం సందర్భంగా నగరంలో వారోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం ఆరిలోవ పోలీసులు పలు పాఠశాలల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విశాలాక్షినగర్‌లో బీవీకే హైస్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పలు విభాగాల్లో పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆరిలోవ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ కృష్ణ మాట్లాడుతూ 'సైబర్ క్రైం నిర్మూలనలో యువత పాత్ర' అనే అంశంపై పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలు జరిపినట్లు తెలిపారు. తోటగరువు హైస్కూల్‌లో 50 మంది, బీవీకే పాఠశాల నుంచి 30 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూజీడీ పనులు ప్రారంభం

టీచర్స్‌కాలనీ: జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలో రూ.42 లక్షలతో యూజీడీ పనులను గురువారం ప్రారంభించారు. మూడు నెలల్లో పనులు పూర్తి చేసి వినియోగంలో తీసుకురావాలని జీవీఎంసీ అధికారులు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలన్నారు.

చర్యలు శూన్యం..!





నౌకానగర్‌లోని జీవీఎంసీ పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్వహిస్తున్న ఫుడ్ కోర్ట్, కార్ మెకానిక్ షెడ్

- 20వ వార్డు నౌకానగర్‌లోని జీవీఎంసీ పార్కు స్థలం ఆక్రమణ
- కబ్జా చేసి కమర్షియల్‌గా వాడుకుంటున్న పలువురు
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలు
- పార్కును అభివృద్ధి చేయాలని స్థానికుల విజ్ఞప్తి

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 20వ వార్డు నౌకానగర్‌లోని పార్కు స్థలం ఆక్రమణకు గురైనా.. అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నౌకానగర్ మాస్టర్ ప్లాన్‌లో పార్కు ఏర్పాటు కోసం కొంత స్థలాన్ని దశాబ్దాల కిందట జీవీఎంసీ కేటాయించింది. అక్కడ పార్కు నిర్మాణం జరగకపోవడంతో కొందరు దాన్ని కబ్జా చేసి ఆక్రమించారు. యథేచ్ఛగా కమర్షియల్ వ్యాపారాలకు వాడుకుంటున్నారు. ఈ పార్కు స్థలంలోని మెజారిటీ భాగాన్ని ఓ వ్యక్తి కార్ మెకానిక్ షెడ్‌గా వినియోగిస్తుండగా.. మరికొందరు ఆప్టికల్ షాపు, ఫాస్ట్‌ఫుడ్, టిఫెన్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. వారు ఆక్రమించిన ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకొని పార్కును అభివృద్ధి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తుండగా.. జీవీఎంసీ అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కబ్జారాయుళ్లకు కొమ్ముకాస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల ద్వంద్వ వైఖరి

ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకొని పూర్తిస్థాయిలో పార్కును అభివృద్ధి చేయాల్సిన జీవీఎంసీ టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు ద్వంద వైఖరి అవలంభిస్తున్నారు. 20వ వార్డు కార్పొరేటర్ గతంలో జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో పార్కు ఆక్రమణపై ప్రస్తావించి చర్యలకు డిమాండ్ చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రూ.8 లక్షల వ్యయంతో పార్కు తొలి దశ అభివృద్ధికి అంచనాలు సిద్ధం చేసినట్లు కార్యనిర్వాహక ఇంజినీర్ పీఎల్ అండ్ సీ పేరిట కార్పొరేటర్‌కు లిఖిత పూర్వక ఉత్తర్వులు పంపించారు. దానిలో పేర్కొన్న మేరకు నేటికీ ఆ పనులు ప్రారంభం కాలేదు. పార్కు స్థలాన్ని స్వాధీనం చేసుకొని అభివృద్ధి చేయాల్సిన జీవీఎంసీ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలు మాకు సంబంధం లేదంటూ ద్వంద వైఖరి ప్రదర్శిస్తున్నాయి. దీంతో ఆయా విభాగాల తీరుపై స్థానికులు నివ్వెరపోతున్నారు. పార్కు స్థలాన్ని స్వాధీనం చేసుకొని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇంజినీరింగ్ విభాగానికి సంబంధం లేదు

నౌకానగర్‌లో పార్కు అభివృద్ధికి ఉత్తర్వులు ఇచ్చిన విషయంలో జోన్–3 ఇంజినీరింగ్ విభాగానికి సంబంధం లేదు. 2023 మార్చిలో పీఎల్ అండ్ సీ విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ రూ.8 లక్షలతో పార్కు అభివృద్ధి చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ వార్డుకు సురేష్ ఏఈగా ఉన్న సమయంలో ఈ ఇవి వెలువడ్డాయి. ఈ విషయంపై నాకు అవగాహన లేదు. మాస్టర్ ప్లాన్ వివరాలు, సర్వే నంబర్లు తెలీదు. టౌన్ ప్లానింగ్ విభాగం కూడా దీన్ని పర్యవేక్షించాల్సి ఉంటుంది.

– శిరీష, అసిస్టెంట్ ఇంజినీర్, జోన్–3

నైపుణ్య కోర్సులతో ఉపాధి అవకాశాలు



విద్యార్థికి సర్టిఫికెట్ అందిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ సిటీ: నైపుణ్యం అందించే కోర్సులతో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పేర్కొన్నారు. ఏయూతో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సెంటర్ నిర్వహించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు గురువారం ఏయూలో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఏయూ అందించే సర్టిఫికెట్‌కు అమితమైన విలువ ఉంటుందన్నారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారు మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చని చెప్పారు. భవిష్యత్తులో ఈ కేంద్రంతో సంయుక్తంగా మరిన్ని కోర్సులు నిర్వహించేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నాక్‌లో ఏయూ అత్యుత్తమ స్థానం సాధించిందన్నారు. ఏయూ అభివృద్ధిని వివరించారు. ప్రత్యేక అతిథి ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఓఎస్డీ ఎ.ఎన్.శెట్టి మాట్లాడుతూ ఈ కోర్సుల నిర్వహణకు ఏయూ అందించిన సహకారాన్ని మరువలేమన్నారు. ఏయూతో కలిసి పనిచేయడం తమకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. భవిష్యత్తులో మరిన్ని కోర్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ రీజనల్ డైరెక్టర్ బీరేంద్రసింగ్, సీనియర్ సాఫ్ట్ స్కిల్స్ ఫ్యాకల్టీ డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

గుర్లలో డయేరియా వ్యాప్తికి కలుషిత తాగునీరే కారణం

టీచర్స్‌కాలనీ: విజయనగరం జిల్లా గుర్లలో తీవ్రస్థాయిలో డయేరియా వ్యాధి ప్రబలడానికి తాగునీరే కారణమని ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు లగుడు గోవిందరావు అన్నారు. గుర్ల ఘటనపై జాతీయ, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు గురువారం ఆయన మీడియాకు తెలిపారు. డయేరియా వ్యాప్తికి దారితీసిన కారణాలు, భవిష్యత్తులో ఈ పరిస్థితిని అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆరుగురు సభ్యులతో కూడిన నిపుణుల బృందం.. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యా మంత్రిత్వ శాఖకు అందజేసిన సమగ్ర నివేదిక ప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాగునీరు విస్తృతంగా కలుషితం కావడంతోనే ఈ ప్రాంతంలో డయేరియా వ్యాధి తీవ్రస్థాయిలో ప్రబలడానికి ప్రధాన కారణమని బృందం నిర్ధారించిందన్నారు. ర్యాపిడ్ రెస్పాన్స్ టీం గుర్ల నుంచి సేకరించిన 44 నీటి నమూనాల్లో 31 నమూనాల్లో కోలిఫామ్‌లు ఉన్నట్లు గుర్తించాయని చెప్పారు. తాగునీరు ఉపయోగకరం కాదని నిర్ధారించిన నేపథ్యంలో సంక్రమణ వ్యాధులు రాకుండా, ప్రబలకుండా కమిటీ సూచించిన చర్యలను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ఇదే విషయమై ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

మిద్దె తోటల నగరంగా విశాఖను తీర్చిదిద్దుదాం



ఎకో వైజాగ్–మిద్దె తోటలపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం: విశాఖను మిద్దె తోటల నగరంగా తీర్చిదిద్దుదామని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం పిలుపునిచ్చారు. ఎకో వైజాగ్‌లో భాగంగా గురువారం మద్దిలపాలెంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో మిద్దె తోటల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో, ఏయూ సోషల్ వర్క్ విద్యార్థులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి ఆధారంగా ఇంటి పైకప్పు మీద వ్యవసాయం చేసి, కూరగాయలు, ఆకుకూరలు పండించి ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. గాంబియా దేశానికి చెందిన సోషల్ వర్క్ విద్యార్థి ఆడమ్ బి సార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, జాతి మొక్కలు పెంచడం గురించి వివరించారు. ఏయూ మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ విద్యార్థిని బి.తేజస్విని మాట్లాడుతూ పురాతన పద్ధతిలో విత్తనాలు, కూరగాయలు, పండ్లు, జాతి మొక్కలు ఇచ్చి పుచ్చుకునే విధానంలో పెంచడం అవసరమన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ 10 మొక్కలు నాటి పెంచాలని కోరారు. కార్యక్రమంలో ప్రైవేట్ విద్యా సంస్థ ప్రతినిధి నీలిమ, ఏయూ సోషల్ వర్క్ విద్యార్థిని బి.చైతన్య సరస్వతి, గ్రీన్ వలంటీర్ జె.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హిత దీపావళిపై అవగాహన



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎంవీపీకాలనీ: పర్యావరణ హిత దీపావళి లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషియాలని ఏఎస్ రాజా ఉమెన్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కాసు పిలుపునిచ్చారు. గ్రీన్‌క్లైమేట్ టీం, సిఫా సంస్థల ఆధ్వర్యంలో గురువారం ఎంవీపీ కాలనీలోని కళాశాల ఆవరణలో విద్యార్థులకు పర్యావరణ హిత దీపావళిపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దీపావళి రోజు వినియోగిస్తున్న మందుగుండు సామగ్రి ద్వారా వాతావరణానికి జరుగుతున్న నష్టాన్ని వివరించారు. పర్యావరణ హితంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు దీపావళి జరుపుకోవాలని సూచించారు. ఈ దిశగా ప్రతి ఇంట్లో అవగాహన పెంచాలని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, ఆయా సంస్థల ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరేశలింగం జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకం



ప్రథమ విజేతకు నగదు బహుమతి అందిస్తున్న ఎంపీ శ్రీభరత్, కళాభారతి ప్రతినిధులు



కార్యక్రమానికి హాజరైన కళాశాల, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు

మద్దిలపాలెం: సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ కళాభారతి ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం పంతులు–సాహితీ సేవ అనే అంశంపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలు స్కూల్, కాలేజీ స్థాయిలో వేర్వేరుగా నిర్వహించారు. విజేతలకు గురువారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో బహుమతుల ప్రదానోత్సవం చేశారు. కళాభారతి అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, ఈటరాంబాబు, ఆచార్య చంద్రశేఖర్, రాజులతో కలిసి ముఖ్య అతిథి విశాఖ ఎంపీ శ్రీభరత్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీఎండీఏ ప్రతినిధులతో కలిసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వీరేశలింగం వంటి మహనీయుల జీవిత చరిత్రను నేటితరానికి తెలియజేసేందుకు ఇటువంటి పోటీలు మరిన్ని నిర్వహించాలని సూచించారు. కళాభారతి అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ గొప్ప సంఘ సంస్కర్తల గురించి నేటితరానికి తెలిపే ఉద్దేశంతో ఈ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ కళాభారతి ఆద్యుడు సి.ఎస్.ఎన్.రాజు అందజేసిన రూ.5 లక్షల ఎండోమెంట్ ఫండ్ మీద వచ్చిన వడ్డీతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న అన్ని విద్యా సంస్థలను అభినందించారు. హైస్కూల్ స్థాయిలో వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.3,000, ద్వితీయ బహుమతిగా రూ.2,000, తృతీయ బహుమతిగా రూ.1,000తోపాటు ప్రశంసా పత్రాలు, పుస్తకాలు ప్రదానం చేశారు. ప్రతి కేటగిరీలో ప్రోత్సాహక బహుమతులుగా రూ.500 చొప్పున 9 మంది విద్యార్థులకు అందించారు. కార్యక్రమ వక్త ఆచార్య కట్టమూరి చంద్రశేఖర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వీరేశలింగం జీవిత విశేషాలను వివరించారు. ముందుగా వీరేశలింగం పంతులు సమకూర్చిన ప్రత్యేక పాటపై విశాఖ వాసులు లక్ష్మి సారథ్యంలో ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. కార్యక్రమంలో 6 స్కూళ్లు, 9 కాలేజీల నుంచి 800 మంది వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత జట్టుకు అభినందన



విజేతలను అభినందిస్తున్న సమత కళాశాల కరస్పాండెంట్ విజయ రవీంద్ర, అధ్యాపకులు

ఎంవీపీకాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల కబడ్డీ పోటీల విజేతగా ఎంవీపీ కాలనీలోని సమత డిగ్రీ కళాశాల పురుషుల జట్టు నిలిచింది. ఈ సందర్భంగా గురువారం కబడ్డీ జట్టును కళాశాల కరస్పాండెంట్ ఆచార్య విజయ రవీంద్ర, అధ్యాపకులు అభినందించారు. ఏయూ ఇండోర్ జిమ్నాజియం వేదికగా ఇటీవల జరిగిన పోటీల్లో వర్సిటీతోపాటు వర్సిటీ అనుబంధ కళాశాలలకు చెందిన 24 జట్లు తలపడ్డాయి. కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన సమత కళాశాల జట్టు తొలి స్థానంలో విజేతగా నిలిచింది. ఏయూ తరఫున సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనే జట్టుకు సమత కళాశాల విద్యార్థులు నలుగురు ఎంపికయ్యారు. వర్సిటీ జట్టుకు కళాశాల విద్యార్థి వీరబాబు కెప్టెన్‌గా నియమితుడయ్యాడు.

శాంతి స్థాపనే ఐక్యరాజ్య సమితి లక్ష్యం



శాంతి కోరుతూ ప్రపంచ దేశాల జెండా నమూనాలు ప్రదర్శిస్తున్న సంతపాలెం పాఠశాల విద్యార్థులు

ఆరిలోవ: ఐక్య రాజ్య సమితి దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. 12వ వార్డు సంతపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు శాంతిని కోరుతూ ప్రపంచ దేశాల జెండా నమూనాలు ప్రదర్శించారు. ఐక్య రాజ్య సమితిలోని సభ్య దేశాల మాక్ అసెంబ్లీ నిర్వహించారు. విద్యార్థులు వివిధ దేశాల ప్రతినిధుల వేషధారణల్లో అలరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సిహెచ్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పిల్లలకు శాంతి సందేశాన్ని ఇచ్చారు. ఐక్య రాజ్య సమితి ఆవిర్భావం గురించి వివరించారు. ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలను నివారించి, శాంతిని నెలకొల్పడానికి 1945 అక్టోబర్ 24న ఐక్య రాజ్య సమితిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ రోజును అందరూ గుర్తుంచుకోవాలన్నారు. దేశాలు ఒకదానికొకటి సహకారం, స్నేహభావం అందించుకోవడం, ఆర్థికాభివృద్ధిని పెంపొందించుకోవడం తదితర అంశాల లక్ష్యంతో ఈ సంస్థను ఏర్పాటు చేశారన్నారు.

యూఎన్‌వో చొరవతో యుద్ధాల నివారణ



మాట్లాడుతున్న ప్రొఫెసర్ బాలమోహన్‌దాస్



వీఎంసీ కళాశాలలో కేక్ కట్‌చేస్తున్న సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు

టీచర్స్‌కాలనీ: ఐక్య రాజ్య సమితి(యూఎన్‌వో) సభ్యత్వం కలిగిన దేశాల చొరవ వల్లే మూడో ప్రపంచ యుద్ధం రాకుండా నివారించగలుగుతున్నామని నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ బాలమోహన్‌దాస్ అన్నారు. ఐక్య రాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం ఇస్కఫ్ ఆధ్వర్యంలో సిరిపురంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. ప్రపంచ శాంతికి ఐక్య రాజ్య సమితి చేస్తున్న పనులను మనందరం గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఇస్కఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ మార్కండేయులు మాట్లాడుతూ ఐక్య రాజ్య సమితి నిర్ణయాలతో మేలు జరుగుతున్నప్పటికీ ఇంకా చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరముందన్నారు. దురదృష్టవశాత్తు పాలస్తీనాపై ఇజ్రాయిల్, ఇజ్రాయిల్‌పై ఇరాన్ యుద్ధాలను నివారించలేకపోతున్నామన్నారు. ఈ యుద్ధాల వల్ల అనేక మంది ప్రాణాలు, ఆస్తులు కోల్పోతూ నిరాశ్రయులవుతున్నారని, వీటిని అరికట్టే ప్రయత్నం చేయాలని సూచించారు. కార్యక్రమంలో శివాని, డి.ఎక్షిత తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతిలో యూఎన్‌వో పాత్ర కీలకం

ఎంవీపీకాలనీ: ప్రపంచ శాంతి స్థాపనలో ఐక్య రాజ్య సమితి పాత్ర కీలకమని ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం చైర్మన్ నరవ ప్రకాశరావు అన్నారు. ఎంవీపీ కాలనీ వీఎంసీ డిగ్రీ కళాశాలలో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం, బీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ సంస్థల ఆధ్వర్యంలో గురువారం యూఎన్‌వో ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నరవ ప్రకాశరావు, వీఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావులు కేక్ కట్‌చేసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రకాశరావు మాట్లాడుతూ ప్రపంచ దేశాల శాంతి, సుస్థిరతే లక్ష్యంగా పనిచేస్తున్న యూఎన్‌వోకు ప్రపంచమంతా మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూలో జంతు సంక్షేమానికి కృషి



జూలో వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న సీసీఎఫ్ దివాన్ మైదీన్

ఆరిలోవ: జూలో జంతువుల సంక్షేమానికి సిబ్బంది కృషి చేయాలని విశాఖ సీసీఎఫ్ బి.ఎం దివాన్ మైదీన్ తెలిపారు. ఇందిరాగాంధీ జూ పార్కులో గురువారం జాతీయ స్థాయి కన్జర్వేషన్ బయాలజిస్టుల వర్క్‌షాప్ నిర్వహించారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. యానిమల్ ఎన్‌క్లోజర్ల డిజైన్‌తో పాటు వాటి సంక్షణలో భాగంగా వివిధ అంశాలపై చర్చించారు. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బయాలజిస్టులు తమ జూ పార్కుల్లో నిర్వహణ, అనుభవాలను పంచుకున్నారు. సెంట్రల్ జూ అథారిటీ(సీజెడ్‌ఏ) అధికారులు పలువురు పాల్గొని వర్క్‌షాప్‌నకు హాజరైన బయాలజిస్టులకు జంతువుల సంరక్షణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీసీఎఫ్ మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాప్ జూ బయాలజిస్టుల సామర్థ్యం పెంచడానికి, వన్యప్రాణి సంరక్షణ బలోపేతం జరగడానికి ఉపయోగపడుతుం దన్నారు. సీజెడ్‌ఏ ఈఎంవో డాక్టర్ దేవేందర్‌కుమార్, రీసెర్చ్ అండ్ కన్జర్వేటివ్ డైరెక్టర్ డాక్టర్ గౌరీ, ఐవీఆర్‌ఐ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ అసిత్ దాస్, యూఎస్ఏ హ్యూస్టన్ జూ పరిరక్షణ భాగస్వామి మూర్తి కంటిహంతి మాట్లాడుతూ సమతుల్య ఆహారం రూపొందించడం, పర్యవేక్షణ, రికార్డు నిర్వహణ, నిర్బంధంలో ఉన్న పాముల పట్ల అధ్యయనం చేయడం, తదితర అంశాలను వివరించారు. జూ క్యూరేటర్ జి.మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు యూజీడీ గోతుల పూడ్చివేత



జేఆర్ నగర్‌లో భూగర్భ డ్రైనేజీ గోతులపై వేసిన తారురోడ్డు



ఇసుకతోటలో యూజీడీ గోతులపై నిర్మించిన రోడ్డు

మద్దిలపాలెం: ఎట్టకేలకు భూగర్భ డ్రైనేజీ గోతులకు మోక్షం లభించింది. యూజీడీ పనుల్లో భాగంగా 15, 16 వార్డుల్లోని పలు వీధుల రోడ్లను తవ్వేశారు. పనులు పూర్తయిన తర్వాత వాటిని తిరిగి సవ్యంగా పూడ్చకుండా వదిలేశారు. దీంతో ఆరు నెలలుగా కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ గోతులు బురమయంగా తయారై ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురయ్యేవారు. పాదచారులు సైతం రాకపోకలు సాగించలేని విధంగా తయారయ్యాయి. ఈ సమస్యపై జీవీఎంసీ అధికారులకు స్థానికులు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా.. పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో భూగర్భ డ్రైనేజీ గోతులపై 'సాక్షి' వరుస కథనాలు ప్రచురించింది. 15వ వార్డు జేఆర్ నగర్ కాలనీలోని అన్ని వీధుల్లో యూజీడీ గోతులు తవ్వేశారు. దీనిపై 'ఏదీ నాటి వైభవం' శీర్షికన ఈ నెల 9న కథనం ప్రచురితమైంది. ఇసుకతోట, పాత వెంకోజీపాలెం వీధుల్లో గోతులపై కథనాలు ప్రచురితమయ్యాయి. జేఆర్ నగర్‌లోని అన్ని వీధుల్లో గోతులను, 16వ వార్డు ఇసుకతోటలో ప్రధాన రహదారిపై గోతులను తారువేసి పూడ్చారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం రేపు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–2 పరిధి 8,9,10,11,12 వార్డులు, జోన్–3 పరిధి 20, 22 వార్డుల పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం తాగునీటికి అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు టీఎల్ సుధాకర్ గురువారం పేర్కొన్నారు. కొమ్మాది పంపు హౌస్‌లో పంపుసెట్లు మరమ్మతులకు గురికావడంతో శనివారం ఆయా జోన్–2, జోన్–3 పరిధిలో గల పలు వార్డుల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడనుందన్నారు. జోన్–2 పరిధి 8వ వార్డు సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం, ఎండాడ, వివేకానంద నగర్, రాజీవ్‌నగర్, రుషికొండ, 9, 10 వార్డుల్లో గల అన్ని ప్రాంతాలు, 11వ వార్డులో గాంధీనగర్, బాలాజీనగర్, అన్నానగర్, 12వ వార్డులో చినగదిలి, పెదగదిలి, సూర్యతేజనగర్, సాలిపేట తదితర ప్రాంతాలు, జోన్–3 పరిధిలో గల ఎంవీపీ సెక్టార్లు 1 నుంచి 7వరకు 9, 10, 11 వార్డుల్లో గల అన్ని ప్రాంతాలు, 20వ వార్డులో పోలమాంబగుడి లైన్, ప్రశాంతినగర్, వర్మగారి రోడ్డు, 22వ వార్డు మంగాపురం కాలనీ, మంగాపురం కాలనీ డౌన్, కాగితాల వీధి అప్, కాగితాల వీధి డౌన్ తదితర ప్రాంతాలకు తాగునీటి అంతరాయం కలగనుందని చెప్పారు. అత్యవసర ప్రాంతాల్లో తాగునీటికి అసౌకర్యం కలగకుండా నీటి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయనున్నట్టు చెప్పారు.